విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాదాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్ చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM
ద్విభాషా దినపత్రిక
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 172 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | ఆదివారం 14 జూలై 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00
GUNTUR | VOL-01 | ISSUE - 172 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 14 SUNDAY JUNE 2024 | PAGES : 8 | Rs :2-00

## ఏపీలో 37 మంది ఐపీఎస్‌ల బదిలీ, పోస్టింగ్‌లు




అమరావతి :ఏపీలో కూటమి ప్రభుత్వం మరోసారి భారీ ఎత్తున ఐపీఎస్ అధికారుల్ని బదిలీలు చేసింది. ఇందులో పలు జిల్లాల ఎస్పీలతో పాటు ఇతర అధికారులు కూడా ఉన్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఇందులో ఎన్నికల సమయంలో బదిలీ చేసిన అధికారులతో పాటు పలువురు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అధికారులు కూడా ఉన్నారు. ఇవాళ బదిలీ అయిన ఐపీఎస్ అధికారుల జాబితా ఇలా ఉంది.రంపచోడవరం ఓఎస్డీగా ఉన్న ఐపీఎస్ కేవీ మహేశ్వర రెడ్డిని శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా నియమించారు. బాపట్ల ఎస్పీ వకుళ్ జిందాల్ ను విజయనగరం ఎస్పీగా బదిలీ చేశారు. విజయనగరం ఎస్పీగా ఉన్న ఎం దీపికను అనకాపల్లి ఎస్పీగా పంపారు. ఏపీఎస్పీ మంగళగిరి ఆరో బెటాలియన్ కమాండెంట్ గా ఉన్న వి రత్నను సత్యసాయి జిల్లా ఎస్పీగా పంపారు. సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డిని పార్వతీపురం జిల్లా ఎస్పీగా పంపారు. అక్కడ ఉన్న విక్రాంత్ పాటిల్ ను కాకినాడ ఎస్పీగా బదిలీ చేశారు.కాకినాడ ఎస్పీగా ఉన్న సతీష్ కుమార్ ను గుంటూరు ఎస్పీగా మార్చారు. గుంటూరు ఎస్పీగా ఉన్న తుషార్ డూడీని బాపట్ల ఎస్పీగా పంపారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అమిత్ బర్దార్ ను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా నియమించారు. అక్కడ ఎస్పీగా ఉన్న తుహిన్ సిన్హాను విశాఖపట్నం డీసీపీ 2గా బదిలీ చేశారు. టీటీడీ విజిలెన్స్ ఛీఫ్ గా ఉన్న నరసింహ కిషోర్ ను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా పంపారు. బి.కృష్ణారావును అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా పంపారు. సీఐడీ ఎస్పీ గంగాధర్ రావును కృష్ణాజిల్లా ఎస్పీగా బదిలీ చేసారు.

# అమ్మకు వందనం అమలుపై ప్రభుత్వం తాజా ప్రకటన..!

అమరావతి :ఏపీ ప్రభుత్వం అమ్మకు వందనం పైన స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేస్తోంది.అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలు చదువుక్నుటున్నా వారికి తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ 15 వేలు చొప్పున తల్లికి అందిస్తామని హామీ ఇచ్చారు.తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో ప్రస్తావించిన అంశాల్లో ఒక్క విద్యార్థికే వర్తిస్తుందనే విధంగా ఉండటంతో వివాదం మొదలైంది. తాము ఈ పథకానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదని ప్రభుత్వం చెప్పగా..ఇప్పుడు మంత్రి రామానాయుడు మరింత స్పష్టత ఇచ్చారు.అమ్మకు వందనం పథకంపై అబద్దపు ప్రచారాలు జరుగుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పే వ్యక్తి జగన్ రెడ్డి అని, ఇచ్చిన మాటపై నిలబడే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని నిమ్మల



చెప్పుకొచ్చారు. ఆ పథకంపై ఇంకా విధివిధానాలు రూపొందించక ముందే "అమ్మకు వందనం మంగళం" అంటూ ప్రచారాలు చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పకుండా నిలబెట్టుకుంటుందని, ప్రతి బిడ్డకూ దీన్ని అమలు చేసి తీరుతామని ఉద్ఘాటించారు.ఎన్నికల హామీ మేరకు పెంచిన వెయ్యి రూపాయల పింఛన్‌ను ఐదు రోజుల్లోనే ఇంటికి తెచ్చి ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. జగన్ ప్రభుత్వానికి వెయ్యి రూపాయలు పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో అమ్మఒడి పేరుతో అమ్మలను మోసం చేశారని, వారికి ఇవ్వాల్సిన నగదులో కోతలు పెట్టారని ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చే ఉచిత ఇసుకపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వైసీపీ నేతల దాడిని ప్రజలే తిప్పికొట్టారని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంపై ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని, లేదంటే ఈసారి ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడం ఖాయమని ఉద్ఘాటించారు.

# నెల రోజుల్లో ఎన్డీయేకు మరో ఝలక్: ఉపఎన్నికల్లో ఇండియా కూటమి స్వీప్..

న్యూఢిల్లీ : ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు ఈ నెల 10న జరిగిన ఉపఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సాధారణ మెజార్టీని దూరం చేసి మిత్రపక్షాలపై ఆధారపడేలా చేసిన ఇండియా కూటమి..తాజాగా జరిగిన ఉపఎన్నికల్లో మరోసారి దుమ్ము రేపింది. ఈసారి సార్వత్రిక ఎన్నికలను మించి సీట్లు సాధించి బీజేపీని, ఎన్డీయేను వెనక్కి నెట్టేసింది. ఎన్డీయే వర్సెస్ ఇండియా బ్లాక్ గా మారిన పోరులో అసాధారణ విజయాలు అందుకుంది.పశ్చిమ బెంగాల్‌లో నాలుగు, హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు, ఉత్తరాఖండ్‌లో రెండు, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడులో ఒక్కొక్క సీట్లకు ఈ నెల 10న ఉపఎన్నికలు జరిగాయి. వీటి ఓట్ల లెక్కింపు ఇవాళ జరిగింది. ఫలితాల్లో బెంగాల్లోని రాయ్‌గంజ్, రణఘాట్ దక్షిణ్, బాగ్దా, మానిక్తలా అసెంబ్లీ సీట్లలో ఉపఎన్నికలను అధికార టీఎంసీ గెల్చుకుని క్లీన్ స్వీప్ చేసింది. అలాగే హిమాచల్ ప్రదేశ్ లోని మూడు సీట్లలో రెండు గెల్చుకోవడం ద్వారా అధికార కాంగ్రెస్ సత్తా చాటింది. ఇందులో సీఎం భార్య కమలేష్ ఠాకూర్ పోటీ చేసిన డెహ్రా సహా మరో సీటు కూడా ఉంది.ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగళౌర్ లో కాంగ్రెస్ గెలుపొందింది. పంజాబ్ లోని జలంధర్ సీటును ఆప్ గెల్చుకుంది. తమిళనాడులోని విక్రవండీ సీటులో డీఎంకే ఘన విజయం సాధించింది. ఎన్డీయే కూటమిలో భాగమైన బీజేపీ మధ్యప్రదేశ్ లోని అమర్వారా సీటులో గెలిచింది. అలాగే హిమాచల్ ప్రదేశ్ లోని హమీర్ పూర్ సీటును బీజేపీ గెల్చుకుంది. మరోవైపు బీహార్




లోనిరూపౌలీ సీటును జేడీయూ గెల్చుకుంది. దీంతో ఇండియా కూటమికి 10 సీట్లు, ఎన్డీయేకు 3 సీట్లు దక్కినట్లయింది.

## అమరవీరుడి భార్యపై కామెంట్లు.. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు

ఢిల్లీ: అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు పెట్టిన ఓ నెటిజన్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం దీనిపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు.ఆ కామెంట్లు చేసిన నెటిజన్ అకౌంట్ వివరాల కోసం సంబంధిత సోషల్ మీడియా సంస్థను సంప్రదించినట్లు తెలిపారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అంశుమాన్ సింగ్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది. ఇటీవల ఆయన సతీమణి స్మృతిసింగ్ రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో యావత్ భారతదేశం అమరవీరుడి కుటుంబాన్ని కీర్తించింది. అవార్డు స్వీకరించే సమయంలో స్మృతి ముఖం చూసిన దేశ ప్రజల కళ్లూ చెమర్చాయి. కానీ కొందరు మాత్రం ఆ వీడియోపై అభ్యంతరకర కామెంట్లు పెట్టడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.ఢిల్లీకి చెందిన అహ్మద్ అనే వ్యక్తి అసభ్యకరంగా చేసిన కామెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్ ను కోరారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఆ యువకుడి చర్యను తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ పోలీసులు తక్షణమే అతడిని అరెస్టు



చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.26వ బెటాలియన్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన కెప్టెన్ అంశుమాన్ సింగ్ గతేడాది జులై 19న విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. సియాచిన్‌లో వారు ఉంటున్న బేస్ క్యాంప్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో చిక్కుకొన్న జవాన్లను కెప్టెన్ ధైర్యంగా కాపాడి బయటకు తీసుకొచ్చారు. అగ్నికీలలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ తీవ్ర గాయాలపాలై మరణించారు. ఆయన శౌర్యానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డును అందించింది.

## 'కేంద్ర సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యం లేదు'.. రాజ్యాంగ హత్యాదినం పై ప్రియాంక గాంధీ



ఢిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన జూన్ 25ను ఇకపై ఏటా 'రాజ్యాంగ హత్యాదినం' (సంవిధాన్ హత్యాదివస్)గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు.మోదీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదని అని విమర్శలు గుప్పించారు."దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాన్ని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు 'సంవిధాన్ హత్యాదివస్' ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు" అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని.. కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారని ఎన్డీయే సర్కార్ గుర్తు చేసింది. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్యాదివస్'గా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇదంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న మరో కపట ప్రచార ఎత్తుగడ అని పేర్కొంది.

## ప్రభుత్వం మారింది.. పనుల్లో నాణ్యత పాటించండి: మంత్రి నిమ్మల



పాలకొల్లు: కూటమి ప్రభుత్వంలో పనులన్నీ నాణ్యతగా జరగాల్సిందేనని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు.కొత్తగా చేపట్టిన భవన నిర్మాణ పనుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శ్లాబ్ నుంచి లీకవుతున్న వర్షపునీరు, నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. "మీ ఇళ్ల నిర్మాణాలు ఇలాగే ఉంటాయా?" అంటూ అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పనులన్నీ నాణ్యతగా జరగాల్సి ఒదేనన్నారు. అనంతరం పాత ఆస్పత్రిలో రోగుల సమస్యలను మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. జగన్ ఐదేళ్ల విధ్వంసం ఆస్పత్రి నూతన భవన నిర్మాణాల్లోనూ కళ్లారా కనిపించిందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన పనులు ఐదేళ్లైనా వైకాపా ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. పనుల పరిస్థితిని కలెక్టర్, వైద్యారోగ్య శాఖ కమిషనర్‌కు ఆయన ఫోనులో వివరించారు. సకాలంలో మిగిలిన పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు.

## జగన్ పాలనలో కడప ఉక్కు పరిశ్రమ అభివృద్ధి శూన్యం



ప్రొద్దుటూరు: అయిదేళ్ల జగన్ పాలనలో కడప ఉక్కు పరిశ్రమ ఒక్క శాతం కూడా అభివృద్ధి చెందలేదని భాజపా ఎంపీ సీఎం రమేశ్ విమర్శించారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు.యువతకు ఉద్యోగాలు రావాలంటే కడప ఉక్కు పరిశ్రమ పూర్తి కావాలని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లు జగన్ తన సంపాదనకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. రాష్ట్రంలోని పురపాలికల్లో ఎక్కడా.. ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజలను భయపెట్టి ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి వసూళ్లకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఆయన సాగించిన అరాచకాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వసూలు చేసిన డబ్బులు వెనక్కి వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ జిల్లాలో జరిగిన భూ దందాలపై త్వరలోనే విచారణ చేయిస్తామని తెలిపారు.

## ఆ ముగ్గురినీ అరెస్టు చేసి కస్టడీలో విచారించాలి

అమరావతి: ఎంపీని అపహరించి, చంపాలని చూసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉండి తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు... రాష్ట్ర డీజీపీ, హోం మంత్రిని కోరారు.నిందితులను వెంటనే అరెస్టు చేసి కస్టడీలో విచారించాలన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.." నా వద్ద ఉన్న ఆధారాలన్నీ కేసు విచారణ అధికారికి అందజేస్తా. ప్రాథమిక విచారణ పూర్తయ్యే వరకు నిందితులను బయటకు వదలొద్దు. సాక్షులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి.అప్పటి వైద్యులపై ఒత్తిడి చేయకుండా పోలీసులు నిఘా పెట్టాలి. హైకోర్టు జడ్జి సమక్షంలోనే మిలిటరీ ఆసుపత్రి వైద్యులు నివేదిక సిద్ధం చేశారు. హింసించడం వల్లే వేలు విరిగిందని, రక్తస్రావమైందని నివేదికలో ఉంది. ఆధారాలు ఉంటే ఎప్పుడైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. కొట్టిన వారిని గుర్తుపట్టలేదని గతంలో చెప్పిన మాట నిజమే. కొట్టేందుకు కుట్ర పన్నింది జగన్, సీతారామాంజనేయులు, సునీల్. కేసు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఐపీఎస్ సునీల్ ప్రయత్నిస్తున్నారు. గత నెల 10న



గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశా. అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ నివేదికను తారుమారు చేశారు'' అని రఘురామ వివరించారు. రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు మేరకు.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్, నిఘా విభాగాధిపతిగా వ్యవహరించిన పీఎస్ఆర్ ఆంజనేయులు సహా మరికొందరిపై గుంటూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# వర్షాకాలంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 13 : వర్షాకాలంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. తీర ప్రాంతాలలో ఇటీవల మృతుల సంఖ్య పెరగడంతో జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నగంజాం మండలం మోటపల్లి గ్రామం రుద్రమంబాపురం, నిరీక్షణగిరి, వేటపాలెం మండలం కటారివారిపాలెం గ్రామం, చీరాల మండలం చీరాల బీచ్, బాపట్ల మండలం సూర్యలంక బీచ్ లలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. బీచ్ లలో భద్రత మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులతో మాట్లాడారు. వారి జీవన శైలి, మత్స్య వేటలో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేటకు అవసరమైన బోట్లు, ఇతర పరికరాలపై ఆరా తీశారు. మత్స్యకారుల జీవన స్థితిగతులు, గ్రామంలో మౌలిక సదుపాయాలపై వివరాల అడిగి తెలుసుకున్నారు. వేట సమయంలో వలలు వేసినప్పుడు చెన్నై రాష్ట్రానికి చెందిన బోట్లు అక్రమంగా జొరబడి వలలు తెంపుకుని వెళ్తున్నాయని, దీంతో తీవ్రంగా



నష్టపోతున్నామని మత్స్యకారులు ఆయనకు వివరించారు. కొన్ని సందర్భాలలో వేటకు వెళితే వచ్చే చేపలు, రొయ్యలతో భోజనానికి కూడా చాలడం లేదని తెలిపారు. వేటకు వెళ్లిన సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలోని వారు గాకుండా పర్యాటకులు ఎవరైనా సముద్రంలో స్నానాలు చేయడానికి వస్తే జాగ్రత్తలు పాటించాలన్నారు. సముద్రంలో లోతుగా వెళ్లకుండా వారికి అవగాహన కల్పించాలని మత్స్యకారులకు సూచించారు. తీరంలో మద్యం తాగడం, అదే క్రమంలో సముద్రంలోకి వెళ్తున్నట్లు గుర్తిస్తే మత్స్యకారులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మోటుపల్లి రుద్రమంబాపురంలోని వీరభద్రాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రాచీన కాలంనాటి వీరభద్రాలయంలో పూజలు చేశారు. పురావస్తుశాఖ అధికారులు భద్రపరిచిన శిలాఫలకాలను పరిశీలించారు. తదుపరి ఆ గ్రామంలో మత్స్యకారులతో కలెక్టర్ మాట్లాడారు. పిల్లలకు పాఠశాల లేదని, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యుత్ స్తంభాల నిర్మాణ సమయంలో పైపులైన్లు దెబ్బ తిని తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేశారు. తుపాను షెల్టర్ లేదని, ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు పాఠశాల లేక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులైన రాణమ్మ, విజయలు కలెక్టర్ కు వివరించారు. ఆయన వెంట చీరాల ఆర్డిఓ సూర్యనారాయణరెడ్డి, బాపట్ల ఆర్డిఓ జి రవీందర్, త తహసిల్దారులు, తదితరులు ఉన్నారు.

# మాజీ మంత్రి అమరనాధ రెడ్డి సేవలు ఆదర్శనీయం.!

## అమర నాథరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన శాసనసభ్యులు నల్లారి

రాయల్ జర్నలిజం ( కలికిరి ) జులై 13 : వాయల్పాడు నియోజక వర్గానికి స్వర్గీయ మాజీ మంత్రి నల్లారి అమరనాధరెడ్డి సేవలు ఆదర్శనీయమని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కొనియాడారు. తన తండ్రి అమర నాద రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా కలికిరి పట్టణంలో రైతు మార్కెట్ యార్డ్ దగ్గర కిషోర్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అయన మాట్లాడుతూ వాయల్పాడు నియోజకవర్గం నుండి 1962 తొలిసారిగా ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గా పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. ఆ క్రమంలోనే 1972, 1978, 1985 లలో కూడా అదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొంది,మొత్తం నాలుగు సార్లు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు మర్రిచెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి హయాంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రయాణం కొనసాగించారని అన్నారు. పీలేరు నియోజకవర్గ స్థాయిలో టీడీపీ బిజెపి, జనసేన శ్రేణుల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అనంతరం కలికిరి రైతు మార్కెట్ యార్డ్ లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బిజెపి,జనసేన,కార్యకర్తలు,



నల్లారి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి రాష్ట్రస్థాయి ప్రతిభ



రాయల్ జర్నలిజం (మైదుకూరు) జూలై 13 : కడప జిల్లా, మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ గత ఏడాదే ఆరు బ్రాంచు లతో ప్రారంభమైంది. అందులో మొదటి బ్యాచ్ కు చెందిన "కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్" బ్రాంచ్ కి చెందిన పి. అనంతసేన టెక్నికల్ బోర్డ్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షలో (1054/1100) 96% మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాడు. ఈ సందర్భంగా విద్యార్థి అనంతసేన మాట్లాడుతూ మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. గురుమూర్తి రెడ్డి సహాయ సహకారాలు, బోధనా సిబ్బంది అందించిన నాణ్యమైన విద్య వల్లే తాను 96% మార్కులు సాధించగలిగానని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన మొదటి బ్యాచ్ లోనే "కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్" బ్రాంచ్ విద్యార్థి 96% మార్కులు సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా, డి.హిరేహాల్ మండలం, మురడి గ్రామానికి చెందిన విద్యార్థి ఇంతటి విజయం సాధించినందుకు తమ పాలిటెక్నిక్ కు గర్వకారణమని తెలిపారు. విద్యార్థి అనంతసేన కు మరియు మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ బోధనా, బోధనేతర సిబ్బంది కి అభినందనలు తెలియజేశారు. ఇంకా గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ లో చేరితే డిప్లమా పూర్తి అయిన విద్యార్థులకు ఉద్యోగ కల్పనకు తోడ్పడుతామని, అలాగే బీటెక్ లో చేరుటకు ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ కూడా ఇస్తామని తెలిపారు.

# బోగస్ సర్టిఫికేట్లు ఏరివేతకు అధికారులను ఆదేశించాలి

రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జూలై 13 : ఈ 16 న జరిగే ఏపి కేబినెట్ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖలోని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ బోగస్ సర్టిఫికేట్లు ఏరివేతకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆదేశించాలని,బోగస్ సర్టిఫికేట్ దారులు బరితెగించి తప్పుడు సమాచారంతో రాష్ట్ర ఉన్నతాధికారులను జైలుకు పంపే ప్రయత్నాన్ని నిలువరించాలని, 2002 డియస్సి కాంట్రాక్టు పారామెడికల్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ కు ముగింపు పలకడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఏపీ డియస్సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.బోగస్ సర్టిఫికేట్లు సత్వరం ఏరివేయలని, అదే సమయంలో జెన్యూన్ సర్టిఫికేట్ దారులను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.అదే విధంగా వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు అక్రమ ధనార్జన లక్ష్యంగా పనిచేస్తున్న అవినీతి అధికారుల బారినుండి నిజాయితీయైన అధికారులను కాపాడాలని ఆయన



కోరారు. బోగస్ సర్టిఫికేట్ దారులకు డియస్సిలో అక్రమ మార్కులు మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పోందుతున్న ప్రక్రియ పట్ల ఉన్నతిధికారుల ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే ఈనాటి ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇదే 2002 రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ద్వారా వివిధ క్యాడర్లులను భర్తీ చేసినప్పటికీ వాటిన్నిటికి ఒకే సారి ముగింపు పలికారని, అయితే నేటికీ 22 సంవత్సరాల కాలం గడిచిన,ఆదే నోటిఫికేషన్ ను హెల్త్ అసిస్టెంట్ క్యాడర్ ను మాత్రం బోగస్ సర్టిఫికేట్లు మాఫియా సూచనలతో ప్రతి దశలో న్యాయస్థానాలకు తప్పుడు సమాచారంతో తప్పుదారి పట్టించి బారి యెత్తున వ్యాపారం కోనసాగతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నిజాలను నిర్భయంగా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి కోర్టుకు పిటనర్ల రూపంలో ఉన్న బొగస్ సర్టిఫికేట్ ఏరివేయడానికి చర్యలు సుకోవాలని ఆయన కోరారు.గత మూడు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న అర్హులైన ప్రభుత్వ శిక్షణ సంస్థల హెల్త్ అసిస్టెంట్లు త్వరితగతిన రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే ప్రైవేట్ శిక్షణ సంస్థల సర్టిఫికేట్లు బోగస్ ని తేల్చి చెప్పిన విజిలెన్స్ రిపోర్ట్ పరిగణలోనికి తీసుకోని వెంటనే ముమ్మరంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు ప్రతిష్టతకు కృషి చేస్తున్నాం

- ఇప్పటికే జిల్లాలో పలు ఆస్పత్రులను క్షేత్రస్థాయిలో సందర్శించి తగిన చర్యలకు ఆదేశించడం జరిగింది.
- పాలకొల్లు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు త్వరలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.
- ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ లో చుక్క వర్షపు నీరు లోనికి రాకుండా తాత్కాలిక మరమ్మత్తులకు అధికారులకు ఆదేశించాము: జిల్లా కలెక్టర్

పాలకొల్లు,జులై 13 (రాయల్ జర్నలిజం): జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా సందర్శించి పాత ఆసుపత్రిని, నిర్మాణంలో ఉన్న 100 పడకల కొత్త ఆసుపత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రులను పటిష్ట పరచడంతో పాటు, మెరుగైన వైద్యం అందించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పాలకొల్లు ప్రస్తుత ఆసుపత్రిలో శ్లాబ్ పెచ్చులు ఊడడం, వర్షపు నీరు లోనికి వచ్చి నిల్వ ఉండటం గమనించడం జరిగిందన్నారు. వర్షపు నీరు లోనికి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం వైద్య సేవలు అందించుటకు ఇబ్బంది ఏమి లేదని స్పష్టం చేశారు. వంద పడకల హాస్పిటల్ 80 శాతం పూర్తయిందని, కింద గదులలో, స్లాబ్ పైన వర్షపు నీరు నిల్వ ఉండడం గమనించామన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, నెల రోజుల్లో వంద పడకల హాస్పటల్ ను అప్ప చెప్పాలని



అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పాలకొల్లు పట్టణానికి అన్ని హంగులతో, పూర్తి సదుపాయాలతో ఆస్పత్రి ప్రారంభోత్సవం చేసి, ప్రజలకు వాడుకలోకి తెస్తామన్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. పాలకొల్లు పట్టణ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, ఏటువంటి కేసులు ఏ సమయంలో వచ్చినా వెనువెంటనే జాయిన్ చేసుకుని అవసరమైన వైద్య సేవలు, వైద్య చికిత్సలు అందించాలన్నారు. తాను తరచూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేస్తానని, వైద్య సేవల్లో లోపాలు కనిపించినా, రోగులు నుండి ఒక్క ఫిర్యాదు వచ్చినా సంబంధిత వైద్యాధి కారులను, వైద్య సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి తెలిపారు.జిల్లా కలెక్టరు వెంట ఏపి మెడికల్ కార్పొరేషన్ ఇంజనీర్ల బృందం యస్.ఇ కె.బలరామి రెడ్డి, ఈఈ బి.వి.గిరి, డిఈ యం.శ్రీనివాస రెడ్డి, హాస్పిటల్ సూపర్డెంటు డాక్టరు రవి కుమార్, డాక్టరు కె.వై.యన్.వర్మ, డాక్టరు సంతోష్ కుమార్,డాక్టరు అనిత, డాక్టరు సౌజన్య, నర్సింగు సూపర్డెంటు విజయ కుమారి, డిప్యూటీ తహశీల్దారు సి.హెచ్. రవిరాజు, రెవిన్యూ ఇన్స్పెక్టరు కె.వరలక్ష్మి, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు, కర్నేని గౌరీ నాయుడు, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్.ఐ.వి బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ

భీమవరం ,జులై 13: మానవతా సాంఘిక సేవా సంస్థ, భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం హెచ్.ఐ.వి బాదిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు పెన్మెత్స రామ్మోహన వర్మ (పూనారామం),. గోవిందబాబులు మాట్లా డుతూ హెచ్.ఐ.వి. బాదిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, దాతలు వారికి పౌష్టికాహారం అందించడం వల్ల ఇమ్యూనిటీ పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, ఈనెల పౌష్టికాహారానికి సౌజన్య సహకారం అందించిన మానవతా సంస్థ కార్యదర్శి వేమూరి రాంబాబుకు అభినందనలు తెలిపారు. 30 మంది హెచ్ఐవి బాదిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారంగా పప్పు దినుసులు, వంటనూనె ,డ్రైఫ్రూట్స్ కిట్లుగా అందించామని సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ .రాంబాబు, సంస్థ కో.చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి (బాబు),కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షులు రాజు, చేకూరి ఝాన్సీ, , నరసయ్య, పళ్ళ శేష లీల, అల్లూరి నరసింహారాజు, వై.ఆర్.జి. కేర్ రాజి, కముజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



రాయల్ జర్నలిజం (వాల్మీకిపురం) జులై 13 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతపర్తి డాక్టర్ శ్రీవిద్య బీసీ , ఎస్.సి హాస్టల్ పరీక్షించి దగ్గు, జలుబు రుగ్మతలు ఉన్నవారికి మాత్రలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య పిల్లలను ఉద్దేశించి వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఈ సీజన్లో వచ్చే డయేరియా, డెంగ్యూ, గురించి మరియు ఓఆర్ఎస్ ద్రావణం గురించి విపులంగా తెలియజేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించి శుభ్రంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం కు సి హెచ్ సి ఇందిరా రాణి, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, భాను బీ ఏ ఎన్ ఎం హృదయేశ్వరి, ఆశలు పాల్గొన్నారు.

# యల్లంపల్లిలో డయేరియా, డెంగ్యూపై అవగాహన



రాయల్ జర్నలిజం ( కలికిరి ) జులై 13 : కలికిరి మండలం లోని యల్లంపల్లి గ్రామములో కలికిరి ఎమ్.పి.డి.ఓ. రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో మేడికుర్తి పి.హెచ్.సి. వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప అధ్యక్షతన వైద్యశిబిరం, డెంగీ, డయేరియా వ్యాధులపై అవగాహన సమావేశం హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, స్ప్రయింగ్ కార్యక్రమం సబ్ యూనిట్ అధికారి ముజీబ్, పారిశుధ్య కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి గోపి మరియు ఈ.ఓ.ఆర్.డి. పరుశురాం సమక్షంలో నిర్వహించారు. . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, త్రాగు నీటిని కాచి చల్లార్చి త్రాగాలని, వ్యక్తిగత మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్స్ అన్ని ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఓ.ఆర్.ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేయడం తెలిపారు. అనంతరం డెంగీ జ్వరాలు ప్రబలకుండా ఫ్రైడే డ్రై డే పాటించాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు సాయంత్రం ఇంటిలో పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎల్.హెచ్.పి.కృష్ణ కుమారి ఏ.ఎన్.ఎమ్. రమాదేవి,అంగన్వాడీ కార్యకర్త కళావతి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంకిత భావంతో విధులు నిర్వహిస్తా



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 13 : పురపాలక సంఘంలో ఎటువంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అంకిత భావంతో కృషి చేస్తానని బాపట్ల పురపాలక సంఘ కమీషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. బాపట్ల నూతన మునిసిపల్ కమీషనర్ గా శనివారం నిర్మల్ కుమార్ విధులు చేపట్టారు. వేద పండితులు వేద మంత్రాలతో కమీషనర్ కు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం పురపాలక సంఘ సిబ్బంది నిర్మల్ కుమార్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాటల్డుతూ బాపట్ల పురపాలక సంఘ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ అంకితభావంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. ముఖ్యంగా ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తానన్నారు.

# అమరావతి నిర్మాణాలపై ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం..!



అమరావతి :ఏపీ ప్రభుత్వం అమరావతి నిర్మాణం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే అమరావతి భవిష్యత్ ప్రణాళికల పైన కసరత్తు కొనసాగుతోంది. ఆర్థికంగా నిధుల సమీకరణతో పాటుగా నిర్మాణాల విషయం లో ఎలా ముందుకు వెళ్లాలనే అంశం పైన నివేదికలు కోరుతున్నారు.అందులో భాగంగా అమరావతిలో నిర్మాణాల పటిష్ఠత పైన ప్రభుత్వం పోకస్ చేసింది. ఐకానిక్ భవనాల నిర్మాణాల పైన తాజాగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

**భవనాలపై అధ్యయనం :** అమరావతిలో తిరిగి పనుల ప్రారంభం ముందు ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. గతంలో నిర్మించిన నిర్మాణాల్లో అయిదేళ్ల కాలంలో పురోగతి లేదు. తిరిగి వాటిని పూర్తి చేయటంతో పాటుగా భవిష్యత్ నిర్మాణాల పైన ప్రతిపాదనలు సిద్దం అవుతున్నాయి. అమరావతిలో మధ్యలో నిర్మాణాలు నిలిచిపోయిన కట్టడాల పటిష్టతపై ముందుగా ఒక అంచనాకు రావాలని నిర్ణయించింది. దీనికోసం ఐఐటి నిపుణుల చేత కట్టడాల పటిష్ఠతపై అధ్యయనం చేయించాలని నిర్ణయించినట్లు ఏపీ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

**నివేదిక ఆధారంగా :** గతంలో ఫౌండేషన్ పూర్తి చేసుకున్న ఐకానిక్ భవనాలతో పాటు ఇతర నిర్మాణాలపై- ఐఐటి ఇంజినీర్ల చేత అధ్యయనం చేయించాలని ఏపి ప్రభుత్వం నిర్ణయించింది. ఐకానిక్ కట్టడాల ఫౌండేషన్ పటిష్టత నిర్ధారణ కోసం ఐఐటి చెన్నైకి బాధ్యతలు అప్పగించాలని డిసైడ్ అయింది.. మరోవైపు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల పటిష్టత నిర్ధారణ కోసం ఐఐటీ హైదరాబాద్‌కు బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

**ప్రణాళికలపై కసరత్తు:** ఐఐటీ నిపుణులు ఇచ్చే నివేదికల ఆధారంగా నిర్మాణాల విషయంలో ముందుకెళ్తామని మంత్రి నారాయణ స్పష్టం చేసారు. అమరావతిలో నిర్మాణాల కోసం గతంలో 47 మంది కన్సల్టెంట్స్‌ను నాటి ప్రభుత్వం నియమించింది. వైసీపీ హయాంలో వారంతా తిరిగి వెనక్కి వెళ్ళిపోయారు. మళ్ళీ కన్సల్టెంట్ల నియామకం కోసం టెండర్లు పిలుస్తామని మంత్రి నారాయణ చెప్పారు. సీఆర్డీయేలో గతంలో ఉన్న సిబ్బంది కంటే ప్రస్తుతం 528 మంది తక్కువగా ఉన్నారని, సిబ్బంది కొరత తీర్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఏపిలో సర్పంచ్ లకే మళ్లీ అధికారం..?



అమరావతి : గ్రామ పంచాయతీలకు మళ్ళీ మంచిరోజులు రానున్నాయి. సర్పంచ్‌లకు మళ్లీ అధికారాలు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ గ్రామ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది.సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో గ్రామ పంచాయతీలు తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. పంచాయతీలకు మంజూరైన 14, 15 ఆర్థికసంఘం నిధులను వైసీపీ సర్కారు ఇతర అవసరాలకు దారిమళ్లించేది. దీంతో పాలక వర్గాలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థకు మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని యోచిస్తోంది.సచివాలయాలను గ్రామ పంచాయతీలతో అనుసంధానం చేసేలా అడుగులు వేస్తోంది. సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు అప్పగించాలని భావిస్తోంది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 647 సచివాలయాలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాల్టీల పరిధిలో మరో 75 సచివాలయాలు (ఇచ్ఛాపురం-10, పలాస-16, ఆమదాలవలస-11, శ్రీకాకుళం-38)ఉన్నాయి. అయితే, ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు వెళ్లకుండా సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. సచివాలయాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు ఉన్నా అందులో పనిచేసే ఉద్యోగులు వారి పరిధిలో లేకుండా పోయారు. వాటి పర్యవేక్షణను రెవెన్యూ శాఖకు అప్పగించింది గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం. కనీసం పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేయడానికి కూడా అభ్యంతరాలు తెలిపింది. తమకు హక్కులు కల్పించాలని సర్పంచ్‌లు పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టించుకోలేదు. దీంతో అటు సర్పంచులు కాని ఇటు పంచాయతీ కార్యదర్శులు గాని ఏమీ చేయలేకపోయారు. నిధుల ఖర్చు విషయంలో జగన్ సర్కారు కట్టడి చేయడంతో పంచాయతీల్లో కనీస వసతులు సమకూర్చడానికి ఆపసోపాలు పడ్డారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలను సకాలంలో చెల్లించలేకయారు. చిన్నచిన్న మరమ్మతు పనులకు బిల్లులు ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.ఆదాయం ఉన్న పంచాయతీలదీ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో పంచాయతీ వ్యవస్థకు గత వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను పంచాయతీలకు అనుసం ధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సర్పంచ్‌లకు అధికారం అప్పగించడం ద్వారా గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటు లోకి తెచ్చేలా అడుగులు వేస్తోంది.

# అన్నా క్యాంటీన్ల నిర్వహణపై చంద్రబాబు కీలక ప్రకటన..!

అమరావతి : త్వరలోనే అన్న క్యాంటీన్స్‌ని ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడించారు. మంచి చేసే వారికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాడేపల్లి మండలం కొలనుకొండ హరే కృష్ణ గోకుల్ క్షేత్రాన్ని సందర్శించారు.వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా గర్భాలయంలో జరగనున్న అనంత శేష స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ తీరును ప్రస్తావించారు. తన లక్ష్యాన్ని స్పష్టం చేసారు.

**వారికి స్వాగతం:** ప్రపంచాన్ని నడిపించేది మనకి తెలియని శక్తి.. ఆ శక్తి దేవుని రూపంలో ఉంటుందని చంద్రబాబు చెప్పారు. ఎవరైతే ఐటిని ఎడాప్ట్ చేసుకుంటారో వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 20 సంవత్సరాల క్రితం నేను ఐటీని ప్రమోట్ చేశానని గుర్తు చేసారు. ఏ దేశానికి వెళ్లినా భారతదేశానికి చెందిన వారుంటారన్నారు. అందులో తెలుగువారు అత్యధికంగా ఉంటారని వివరించారు. వేంకటేశ్వర స్వామి తమ కుల దైవమని చెప్పిన చంద్రబాబు.. నేను నమ్మిన దేవుడు.. ప్రార్థన చేసే దేవుడు.. నాకు ప్రాణ భిక్ష పెట్టింది కూడా వేంకటేశ్వర స్వామేనని చెప్పుకొచ్చారు.

**గత ప్రభుత్వం తీరు :** పెనుగొండలో 108 అడుగుల ఏక రాతి విగ్రహంతో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నిర్మాణానికి నాడు ఇస్కాన్ ముందుకు వస్తే, తరువాత వచ్చిన ప్రభుత్వం, దాన్ని కూడా రద్దు చేసిందన్నారు. మంచి కార్యక్రమాలని అడ్డుకోవటమే, గత 5 ఏళ్ళలో జరిగిందన్నారు. ఇక అలాంటి పరిస్థితి నేడు ఆంధ్రప్రదేశ్ లో లేదు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అందరినీ స్వాగతం పలుకుతున్నానని వెల్లడించారు. పేదరికం లేని సమాజాన్ని దేశంలో తీసుకురావాలి జీరో పావర్టీ స్టేట్‌గా మన ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దామన్నారు. అక్షయ పాత్ర ద్వారా 23 సంవత్సరాల్లో 400 కోట్ల మందికి భోజనాలు పెట్టారని చెప్పుకొచ్చారు.

**అన్నా క్యాంటీన్లు :** అక్షయపాత్ర ద్వారా రోజుకు 22 లక్షల మందికి భోజనాలు అందిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. త్వరలోనే అన్న క్యాంటీన్స్‌ని ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడించారు. మంచి చేసే వారికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ ఉంటుందన్నారు. భారతీయులు బాగుండాలని.. అందులో ఆంధ్రులు అగ్రస్థానంలో ఉండాలన్నారు. మీరు చేసిన మంచే మిమ్మల్ని కాపాడుతుందన్నారు. అక్కడి నుంచి చంద్రబాబు టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజలనుంచి వచ్చే వినతలను స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ఎర్ర నీళ్ల గోదావరిలో తొలి పులస వలకు చిక్కింది.. రికార్డులను బద్దలు కొట్టిన ధర..



అమరావతి : 'పులస కోసం పుస్తెలు కూడా తాకట్టు పెడతారు' ఈ సామెత గోదావరేతర జిల్లాల వారికి కాస్త అతిశయోక్తి లాగా అనిపిస్తుంది. పులస కోసం మైళ్ళ దూరమైనా గోదావరి జిల్లాల వాసులు వెళ్తారు.పులస పులుసు కోసం ఎంతటి ఇబ్బందులైనా పడతారు. ఏడాదిలో.. ముఖ్యంగా వానలు కురిసే సమయంలో పులస ముక్కను తినాలని.. పులస పులుసును జుర్రు కోవాలని అనుకుంటారు. దానికోసం ఎంత ఖర్చయినా చేస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించాయి. మెండుగానే వర్షాలు కురుస్తున్నాయి. కొత్తనీటితో నదులన్నీ ఎర్రగా కనిపిస్తున్నాయి. మిగతా ప్రాంతాలు ఏమోగానీ.. గోదావరి పరిసర ప్రాంతాల్లో మాత్రం ఎర్ర నీరు వచ్చి చేరిందంటే పులస వలకు చిక్కినట్టే.. అయితే ఈసారి వర్షాలు కాస్త ఆలస్యం కావడంతో గోదావరి జిల్లాల మత్స్యకారులు డీలా పడిపోయారు. ఆలస్యమైనప్పటికీ.. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో.. మత్స్యకారుల వలలకు పులసలు చిక్కుతున్నాయి.. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అప్పన రాముని లంక గోదావరిలో మత్స్యకారులకు పులస చేప చిక్కింది. గోదావరి జిల్లాల్లో ఆషాడం అల్లుళ్లకు, బంధువులకు పులస చేపలతో విందు ఇవ్వడం ఒక ఆనవాయితీ.గత 15 రోజులుగా గోదావరి ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నీరు పూర్తిగా రంగు మారింది. ఎప్పుడైతే నీరు రంగు మారిందో ఎప్పుడైతే నీరు రంగు మారిందో మత్స్యకారులు వలలతో వేటకు వెళ్ళిపోయారు. గోదావరి మత్స్యకారుల కష్టాన్ని చూసి చలించిపోయినట్టుంది.. అందుకే వారికి ఆనందాన్ని ఇవ్వాలని పులసను వారి వలలకు చిక్కేలా చేసింది. దీంతో ఆ మత్స్యకారుల ఉత్సాహానికి అవధులు లేకుండా పోయాయి. అప్పన రాముని లంక గోదావరిలో ఓ మత్స్యకారుడి వాళ్లకు పులస చిక్కింది. ఈ చేప భారీ ధర పలికింది. ఆ అనుకున్నట్టుగానే రికార్డ్ స్థాయిలో ఆ మత్స్యకారుడికి లాభం దక్కింది. కేజీన్నర బరువు ఉన్న పులస చేపను అప్పన రాముని లంక మాజీ సర్పంచ్ బర్రె శ్రీను 24,000 కొనుగోలు చేశారు.. పోటాపోటీ మధ్య ఆయన ఆ ధరకు దక్కించుకున్నారు. చేపను సొంతం చేసుకున్న అనంతరం శ్రీను ఆ విషయాన్ని తన కుటుంబ సభ్యులతో ఫోన్లో చెప్పారు. బంధువులతో కూడా తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ చేప అమోఘమైన రుచిని కలిగి ఉంటుంది. ఏడాదిలో ముఖ్యంగా కొత్తనీరు వచ్చే సమయంలో ఎక్కువగా లభిస్తుంది.కొత్తనీరు చేరడం వల్ల ఈ చేపలు గోదావరికి ఎదురెక్కుతాయి. కొత్త నీటిని తాగడం వల్ల వీటి శరీరం రంగు మారుతుంది. అంతేకాదు ప్రత్యేకమైన ఖనిజలవణాలను శోషించుకోవడం వల్ల ఆ చేప ప్రత్యేక లక్షణాలను సంతరించుకుంటుంది. దానిని తినడం వల్ల శరీరానికి మెండుగా పోషకాలు లభ్యమవుతాయి. రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. చింతపండు, కాస్త పచ్చి మామిడికాయలను జత చేసి పులుసు పెడితే.. అమోఘమైన రుచి లభిస్తుంది. అందుకోసమే గోదావరి జిల్లా వాళ్లు పులస చేప అంటే ఎగబడతారు. పూర్వపు రోజుల్లో తమకు ఏవైనా కార్యాలయంలో పనులు కావాలంటే సంబంధిత అధికారులకు పులస చేపలను పంపించేవారు. ఇంకొందరైతే పులస చేపలను పచ్చడి పెట్టించి ఇచ్చేవారట. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తమ వలలకు పులస చేపలు మరిన్ని చిక్కుతాయి అంటూ మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే వికెట్ నంబర్ 9: అరికెపూడి అవుట్..



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. తన దూకుడును కొనసాగిస్తోంది. ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితిని ఖాళీ చేసే పనిలో పడింది.ఇప్పటికే పలువురు శాసన సభ, శాసన మండలి సభ్యులు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. మాజీ ఎంపీలు సైతం అదే బాట పట్టారు.మొన్నటికి మొన్న.. ఆరు మంది ఎమ్మెల్సీలు బీఆర్ఎస్‌ను వీడారు. దండె విఠల్, భానుప్రసాద్ రావు, ఎంఎస్ ప్రభాకర్, బొగ్గారపు దయానంద్, ఎగ్గే మల్లేశం, బస్వరాజు సారయ్య.. కాంగ్రెస్‌లో చేరారు. ఈ విషయంలో అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడాలు కూడా చూడట్లేదు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని అర్ధరాత్రి హైదరాబాద్‌కు రాగా ఆయన సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.ఇప్పటివరకు మొత్తం ఎనిమిదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కడియం శ్రీహరి- స్టేషన్ ఘన్‌పూర్, దానం నాగేందర్- ఖైరతాబాద్, తెల్లం వెంకట్రావ్- భద్రాచలం, పోచారం శ్రీనివాసరెడ్డి- బాన్సువాడ, డాక్టర్ ఎం సంజయ్ కుమార్- జగిత్యాల, కాలె యాదయ్య- చేవెళ్ల, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి- గద్వాల, టీ ప్రకాష్ గౌడ్- రాజేంద్రనగర్ కాంగ్రెస్‌లోకి వరుస కట్టారు.తాజాగా బీఆర్ఎస్‌కే చెందిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా .. ఈ జాబితాలో చేరారు. పార్టీ ఫిరాయించారు. రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. పట్నం మహేందర్ రెడ్డితో కలిసి కొద్దిసేపటి కిందటే రేవంత్ రెడ్డిని కలిశారు. ఆయన చేతుల మీదుగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి విజయం సాధించారు అరికపూడి. 2014- 2018 ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుంచీ గెలిచారు. ఆ తరువాత పార్టీ ఫిరాయించారు. బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తు మీద విజయం సాధించారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు.

# వైఎస్ షర్మిల సంచలనం



అమరావతి : అన్నాచెల్లి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, షర్మిల మధ్య హాట్ హాట్ రాజకీయాలు సాగుతున్నాయి. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వం కోసం ఈ ఇద్దరూ ప్రయత్నిస్తున్నారు.ఈ క్రమంలోనే అన్నాచెల్లి మధ్య దూరం పెరిగి రాజకీయ వైరం సాగుతోంది. ఇప్పటికే తండ్రి వైఎస్సార్ పేరిట రాజకీయపార్టీ పెట్టి ప్రజలవద్దకు వెళ్లి ఓసారి అధికారాన్ని కూడా చేపట్టారు జగన్... ఇలా తండ్రిపేరు చెప్పుకుని సక్సెస్ అయ్యారు. అయితే ఇప్పుడు తండ్రి లెగసీని వాడుకునేందుకు వైఎస్ షర్మిల సిద్దమయ్యారు... అందువల్లే వైఎస్సార్ సిపి కి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో సంబంధం లేదంటూ ప్రజల్లోకి వెళుతున్నారు. ఇలా అన్నాచెల్లి మధ్య తండ్రి రాజకీయ వారసత్వం కోసం పోరు సాగుతోంది.ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న షర్మిల తండ్రి వైఎస్సార్ ఈ పార్టీకి చెందినవారుగా పేర్కొంటున్నారు. తన తండ్రి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా బిజెపికి వ్యతిరేకంగా పనిచేసారని గుర్తుచేసారు. అలాంటి బిజెపితో అంటకాగిన వైసిపి వైఎస్సార్ తమ నాయకుడని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నిస్తున్నారు. పచ్చిగా చెప్పాలంటే వైసిపిని బిజెపి ఉంచుకుందని... ఈ రెండు పార్టీలకు అక్రమ సంబంధం వుందని షర్మిల సంచలన వ్యాఖ్యలు చేసారు. ఇలాంటి పార్టీతో దివంగత వైఎస్సార్ కు ఎలాంటి సంబంధం లేదు... అప్పుడూ, ఇప్పుడు, ఎప్పుడూ ఆయన కాంగ్రెస్ నాయకుడేనని షర్మిల స్పష్టం చేసారు.

**వైఎస్సార్ విగ్రహాలపై దాడులొద్దు..:**తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఏర్పాటుతర్వాత జరుగుతున్న వైస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల ధ్వంసంపై షర్మిల సీరియస్ అయ్యారు. అసలు వైసిపికి వైఎస్సార్ కు ఏ సంబంధము లేదు... అలాంటిది ఆయన విగ్రహాల విగ్రహాలను ధ్వంసమెందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలా వైఎస్సార్ విగ్రహాలపై జరుగుతున్న దాడిని ఆమె ఖండించారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల మనిషి... ఆయనకు రాజకీయాలు ఎందుకు ఆపాదిస్తున్నారు? అని షర్మిల ప్రశ్నించారు. వైఎస్సార్ ఏనాడు వైసిపి పార్టీలో లేడు... ఆ పార్టీ నాయకుడు కాదన్నారు. అసలు వైసిపి అంటే వైఎస్సార్ కాంగ్రెస్ కాదు యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను సాధించడం వైసిపితో సాధ్యం కాదన్నారు. నిజంగానే వైఎస్సార్ ఆశయసాధనకే వైసిపి పనిచేస్తుంటే ఆయన కలల ప్రాజెక్ట్ జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని షర్మిల ప్రశ్నించారు.

వైఎస్సార్ పక్కా కాంగ్రెస్ మనిషి... బ్రతికున్నంత కాల కాంగ్రెస్ లోనే వున్నారు... చివరకు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా చనిపోయారని షర్మిల తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రెండుసార్లు పనిచేసిన ఆయన ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని గుర్తుచేసారు. ఇలా ప్రజాసేవ చేసిన మహోన్నత నాయకుడి విగ్రహాలు ధ్వంసం చేయడం తగదన్నారు. ఇంకోసారి వైఎస్సార్ విగ్రహాల జోలికి వస్తే అస్సలు ఊరుకోం... పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామంటూ షర్మిల హెచ్చరించారు.

**బిజెపికి తోక పార్టీ వైసిపి :**తెలుగు దేశం పార్టీకి కాంగ్రెస్ తోక పార్టీల మారిందంటూ వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలకు షర్మిల కౌంటర్ ఇచ్చారు. బిజెపికే వైసిపి తోకపార్టీలా మారిందని...రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టిమరీ సహకరించిందన్నారు. బీజేపీ తీసుకున్న ప్రతి నిర్ణయానికి వైసిపి మద్దతు తెలిపింది... దీన్నిబట్టే ఎవరు ఎవరికి తోకపార్టీనో ప్రజలకు అర్థమయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎవరికో తోక పార్టీ కాదని నిరూపించాల్సిన అవసరం లేదన్నారు.ప్రస్తుతం ఏపీలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు. మిగతా పార్టీలన్నీ బిజెపి అనుబంధ పార్టీలే.... కొన్ని సక్రమ పొత్తులయితే ఇంకొన్ని అక్రమ పొత్తులని అన్నారు. బీజేపీ అంటే బాబు,పవన్ ,జగన్ అంటూ కొత్త నిర్వచనం చెప్పారు షర్మిల.వైఎస్సార్ ఫోటో పార్టీలో పెట్టుకుంటే సరిపోదు... గుండెల్లో ఉండాలన్నారు షర్మిల. వారి గుండెల్లో వైఎస్సార్ లేరు కాబట్టే ఆయన ఆశయాలను గాలికి వదిలేశారంటూ అన్న జగన్ కు చురకలు అంటించారు. నిజంగా వైఎస్సార్ పై అంత ప్రేమే ఉంటే మొన్న 75వ జయంతిన ఏ కార్యక్రమం చేసారు? ఘాట్ వద్ద 5 నిమిషాలు తూ తూ మంత్రంగా నివాళులు అర్పించారని అన్నారు. వందల కోట్లు సిద్ధం సభలకు ఖర్చు పెట్టారుగా... మరి తండ్రికి నివాళిగా ఒక్క సభ నిర్వహించలేరా? ఏం ఆయన జయంతి ప్రత్యేకం కాదా..? అంటూ అన్నను నిలదీసారు షర్మిల. వైఎస్సార్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాబట్టే తాను పెద్దసభ పెట్టానని షర్మిల తెలిపారు.

# పేర్లు మార్పు.. వైఎస్ చంద్రబాబు, నారా జగన్?



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీలో నేమ్ గేమ్ కొనసాగుతుంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెట్టిన పథకాల పేర్లను మళ్లీ మారుస్తున్నారు.టిడిపి వర్సెస్ వైసీపీ అన్నట్టుగా ఏపీ పథకాలపై కొనసాగుతున్న నేమ్ గేమ్ ప్రస్తుతం ఏపీలో హాట్ టాపిక్ గా మారింది.

**చంద్రబాబు పేరు ఎక్కడా వినపడకూడదని జగన్:** 2019 ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబు పాలన పోయి జగన్ పాలన వచ్చిన తర్వాత జగన్ పథకాలపై తన మార్క్ ఉండేలా పేరు మార్పు చేశారు. చంద్రబాబు పేరు ఎక్కడా వినపడకూడదని నిర్ణయం తీసుకుని, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైయస్సార్ విద్యోన్నతి, జగనన్న విదేశీ విద్యా దీవెన, వైయస్సార్ ఆరోగ్యశ్రీ ఇలా ప్రభుత్వ పథకాలకు వైఎస్ఆర్ పేరు, జగన్ పేరు పెట్టుకున్నారు.

**జగన్ పథకాల పేర్లు మార్చిన చంద్రబాబు:** గతంలో ఉన్న కొన్ని పథకాలకు పేర్లు మార్చి, కొత్త పథకాలను తీసుకువచ్చిన జగన్ ప్రతి పథకంలోనూ తన మార్కు ఉండేలాగా తన పేరు తన తండ్రి పేరు ఉండేలాగా చూసుకున్నారు. మొదటినుంచి పథకాల పేర్లు మార్పుపై జగన్ వ్యవహార శైలిని వ్యతిరేకించిన చంద్రబాబు మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న పథకాల పేర్లను మళ్ళీ యధావిధిగా మార్చేశారు.

**ప్రస్తుతం పథకాల పేర్లు ఇలా:** అంతకుముందు టీడీపీ హయాంలో ఉన్న పేర్లనే మళ్ళీ మార్పు చేశారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు పేరును చంద్రన్న పెళ్లి కానుకగా, వైఎస్ఆర్ విద్యా దీవెన పథకానికి ఎన్టీఆర్ విద్యోన్నతిగా, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధిగా, అమ్మ ఒడి పథకాన్ని, తల్లికి వందనంగా, వైయస్సార్ ఆరోగ్యశ్రీని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా పేర్లు మార్చారు.

**ఏపీ వాసులలో విస్మయం..:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పథకాలపై అటు జగన్, ఇటు చంద్రబాబు ఆడుతున్న నేమ్ గేమ్ పై ఆసక్తికర చర్చ జరుగుతుంది. ప్రజలకు ఇచ్చే పథకాలకు ఇలా ఎవరికి వారు తమ మార్కు ఉండేలా పేర్లు పెట్టుకోవడం ఏపీ వాసులను విస్మయానికి గురిచేస్తుంది. ఎవరికి వారు గత ప్రభుత్వ పాలన తాలూకా గుర్తులు ఉండకూడదని భావిస్తూ పేర్లు మార్చటంపైన ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారని ఏపీ వాసులు భావిస్తున్నారు.

**పథకాలపై రాజకీయ చదరంగం :** ఇలా ప్రభుత్వాలు మారినప్పుడల్లా పేర్లు మారుస్తూ నేమ్ గేమ్ ఆడటం మంచిది కాదని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసలు పాలన సాగించే వారి పేరు మీద పథకాలు పెట్టకుండా చూడాలని, పథకాలను కూడా రాజకీయ చదరంగంలో పావులుగా మార్చటం మంచిది కాదంటున్నారు. జగన్, చంద్రబాబుల పేర్లు వైఎస్ చంద్రబాబు, నారా జగన్ అంటే ఎలా ఉంటుందో... ఊరికే పథకాల పేర్లు మారిస్తే అలాగే ఉంటుందంటున్నారు ఏపీ ప్రజలు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# జగన్‌లో అనూహ్య మార్పు - కీలక నిర్ణయం, ఇక నేరుగా..!

అమరావతి :ఒటమి తరువాత జగన్ లో మార్పు కనిపిస్తోంది. పార్టీ కేడర్ కోరుకున్న విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. జగన్ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ నేతలకు..ప్రజలకు అందుబాటులో లేకపోవటం పార్టీ శ్రేణులకే నచ్చలేదు.ఓటమికి ఇది కూడా కారణంగా విశ్లేషణలు ఉన్నాయి. సీఎంగా పార్టీ ఎమ్మెల్యేలను కలిసే అవకాశం దక్కలేదనే విమర్శలు వినిపించాయి. దీంతో, జగన్ తన వైఖరి మార్చుకుంటున్నారు. తాను మారుతున్నాననే సంకేతాలు ఇస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.ముఖ్యమంత్రి జగన్ ఇక నుంచి పార్టీ నేతలు..కేడర్ తో పాటుగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. ఇందు కోసం ఈ నెల 15వ తేదీ నుంచి తాడేపల్లి తన నివాసంలోనే ప్రజాదర్బార్ కు సిద్దం అవుతున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలోనే ప్రజలు వచ్చి కలవటానికి వీలుగా గ్రిల్ నిర్మాణం పూర్తి చేసారు. కానీ, జగన్ అనేక సార్లు ప్రజాదర్బార్ నిర్వహిస్తారనే ప్రచారం సాగినా..నిర్వహించలేదు. ప్రజలతో మమేకం కావటం పైన సొంత పార్టీలోనే జగన్ పైన విమర్శలు వచ్చాయి.వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో నిర్వహించిన తరహాలోనే ప్రజాదర్బార్ నిర్వహించాలని పలువురు పార్టీ నేతలు అధికారంలో ఉన్న సమయంలోనే జగన్ కు సూచించారు. అయిదేళ్ల పాటు జగన్ నేరుగా జనం తనను కలిసేందుకు అవకాశం ఇవ్వలేదు. పార్టీ ఎమ్మెల్యేలు సైతం నేరుగా కలవలేని పరిస్థితులు ఎదుర్కొన్నామని ఎన్నికల ఫలితాల తరువాత పలువురు ఎమ్మెల్యేలు విమర్శలు గుప్పించారు. సజ్జల అంతా తానై వ్యవహరించారని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పుడు ఓటమి తరువాత జగన్ లో మార్పుల మొదలైంది.పులివెందులకు వెళ్లిన సమయంలోనూ జగన్ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజానీకం జగన్ ను కలిసేందుకు వస్తున్నారు. ఇదే విధంగా తాడేపల్లిలోనూ ప్రజాదర్బార్ నిర్వహించాలనే నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తరువాత జిల్లాల పర్యటనలకు జగన్ సిద్దం అవుతున్నారు. అయితే, జగన్ ప్రజాదర్బార్ గురించి పార్టీ నుంచి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

# హైదరాబాద్-విజయవాడ ప్రయాణికులకు మరో గుడ్ న్యూస్..!

అమరావతి : హైదరాబాద్ నుంచి విజయవాడ లేదా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు మరో గుడ్ న్యూస్ అందింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులైన ఈ రెండు మహా నగరాల మధ్య ప్రయాణాన్ని మరింత సౌలభ్యంగా మార్చేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో మరో అడుగు పడింది.ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో దీన్ని అమలు చేయబోతోంది.హైదరాబాద్-విజయవాడ మధ్య జాతీయ రహదారిని ఆరు లేన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా విస్తరించేందుకు వీలుగా జాతీయ రహదారి ప్రాధికార సంస్థ చురుగ్గా ప్రయత్నాలు చేస్తోంది. గతంలో ఈ పని కోసం టెండర్లు దక్కించుకున్న జీఎంఆర్ సంస్థ అర్ధాంతరంగా వైదొలగడంతో దాని స్థానంలో మరో కాంట్రాక్టర్ ను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు రూ.700 కోట్ల బడ్జెట్ తో ఈ జాతీయ రహదారిని విస్తరించేందుకు టెండర్లు పిలవబోతున్నారు.తెలంగాణ రాష్ట్రం పరిధిలో 181 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిని గతంలో నాలుగు లైన్లుగా విస్తరించారు. కానీ ఆరు లైన్ల విస్తరణ సాధ్యం కాలేదు. కానీ అప్పటికే భూసేకరణ జరిగిపోవడంతో ఇప్పుడు కొత్తగా భూసేకరణ అవసరం లేదు. ఈ నేపథ్యంలో ఈ రహదారి విస్తరణ పనులకు డీపీఆర్ తయారీకి ఓ ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించబోతున్నారు. అనంతరం రూ.700 కోట్ల పనులకు టెండర్లు పిలుస్తారు. వెంటనే పనులు కూడా ప్రారంభం కానున్నాయి.హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల్ని వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఇది పూర్తయితే హైదరాబాద్-విజయవాడ మధ్య ప్రయాణ వేగం పెరగడంతో పాటు సమయం కూడా భారీగా ఆదా కానుంది.

# ఏపీలో మరో వరం ప్రకటించిన సీఎం చంద్రబాబు



అమరావతి : ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక పథకాలను ప్రకటిస్తున్నారు. అందులో భాగంగా మరో పథకాన్ని పొడిగించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఉద్దేశించిన ఆరోగ్య పథకాన్ని వచ్చే ఏడాది వరకు పొడిగించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఇది వర్తిస్తుందంటూ సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం తరహాలోనే వర్కింగ్ జర్నలిస్టులు కూడా దీనిద్వారా వైద్యసేవలు పొందుతారు.

**ఆదాయ పరిమితులు లేవు :** వైద్యసేవలు పొందే విషయంలో ఎటువంటి ఆదాయ పరిమితులు ఉండవు. రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ ఉన్న పాత్రికేయులంతా ఈ పథకానికి అర్హులే. దీనిద్వారా పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు సంవత్సరం మొత్తంమీద ఎన్నిసార్లైనా రూ.2 లక్షల విలువైన వైద్య చికిత్సలు పొందవచ్చు. దీనిపై పాత్రికేయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటికీ పేర్లు మార్చారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2014-19 సమయంలో తమ ప్రభుత్వంలో ఏ పథకాలకు ఏ పేర్లైతే ఉన్నాయో వాటిని తిరిగి పెట్టారు. తాజాగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చారు.

**ఆధ్యాత్మిక ఆనందం కావాలి :** గుంటూరు జిల్లా కొలనుకొండలో ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో నిర్వహించిన అనంత శేషస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పనులు చేయాలనుకునే ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆహ్వానిస్తోందని, వారికి ఇకనుంచి ఎటు వంటి స్పీడ్ బ్రేకర్లు అడ్డుపడవన్నారు. అక్షయపాత్ర స్ఫూర్తితో అతి త్వరలోనే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించబోతున్నట్లు చెప్పారు. హరేకృష్ణ సంస్థ నుంచి ప్రతిఒక్కరూ స్ఫూర్తి పొందాల న్నారు. ఆధ్యాత్మికత ద్వారా మానసిక ఆనందాన్ని ప్రతి ఒక్కరూ పొందాలని, అది లేకపోతే జీవితంలో ఎవరూ ముందుకు వెళ్లలేరన్నారు.

# ఏపీ ఎన్నికల ప్రధాన అధికారిగా వివేక్ యాదవ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా బదిలీ అయ్యారు. కొత్తగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి వివేక్ యాదవ్ నియమితులు అయ్యారు.కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే వివేక్ యాదవ్ సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. వివేక్ యాదవ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖేశ్ కుమార్ మీనా రిలీవ్ కానున్నారు. ఎన్నికలు నిర్వహించడంలో విజయవంతం అయిన ముఖేశ్ కుమార్ మీనాకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఏపీ ప్రభుత్వం 19 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. వారిలో సీనియర్ ఐఏఎస్ అధికారి వివేక్ యాదవ్ సైతం ఉన్నారు. యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శిగా వివేక్ యాదవ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ క్రమంలో తాజాగా కేంద్ర ప్రభుత్వం సీఈవోగా బదిలీ చేసింది.



**ఇటీవలే 19 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం మరోసారి ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇప్పటికే రెండు సార్లు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవలే ఒకేసారి 19 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా మరోసారి 19 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ప్రభుత్వంలో తన మార్క్ కోసం చంద్రబాబు నాయుడు పాటు పడుతున్నారు. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు పార్టీలతో సంబంధం లేని మంచి అధికారులుగా గుర్తింపు తెచ్చుకున్న వారికి పదవులు కట్టబెట్టారు. ఆంధ్రప్రదేశ్ సమాచారం పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లాను నియమించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి జి.అనంతరామును ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. రామ్ ప్రకాశ్ సిసోడియాను రెవెన్యూ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులు అయ్యారు. అలాగే జయలక్ష్మిని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండేను ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది.

**బదిలీ అయిన అధికారులు వీరే**

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా హరీశ్ కుమార్ గుప్తా
హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కుమార్ విశ్వజిత్
అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.అనంతరాము
స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యదర్శిగా ఆర్.పి. సిసోడియా
సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్‌గా జి.జయలక్ష్మి
ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే
పెట్టుబడులు మౌలిక సదుపాయాల కార్యదర్శిగా సురేశ్ కుమార్ (గ్రామవార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలు)
(జీఏడీ కార్యదర్శిగానూ అదనపు బాధ్యతలు)
ఐటీశాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా సౌరభ్ గౌర్
పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శిగా యువరాజ్
మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా హర్షవర్ధన్
వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యదర్శిగా పి.భాస్కర్ (ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలు)
సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా కె.కన్నబాబు (గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గానూ బాధ్యతలు)
పర్యాటకశాఖ కార్యదర్శిగా వినయ్‌చంద్
యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శిగా వివేక్ యాదవ్
మహిళా, శిశుసంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా సూర్యకుమారి
ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా సి.శ్రీధర్
ఆర్థికశాఖ అదనపు కార్యదర్శిగా జె.నివాస్
పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా విజయరామరాజు
సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్‌గా హిమాన్షు శుక్లా
వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా ఢిల్లీరావు
వ్యవసాయశాఖ నుంచి హరికిరణ్ బదిలీ
గిరిజాశంకర్- ఆర్థికశాఖ నుంచి రిలీవ్

# దినసరి కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయం



గుంటూరు : జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే దినసరి కార్మికులకు (ఎన్ఎంఆర్ వర్కర్స్) 2024-2025 సంవత్సరానికి రోజువారీ వేతనాలను కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ నిర్ణయించింది.శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్ఎంఆర్ కార్మికులకు రోజువారీ కూలీగా అత్యంత నైపుణ్యం కలిగిన వారికి రూ.870, నైపుణ్యం కలిగిన వారికి రూ.825, పాక్షిక నైపుణ్యం ఉన్న వారికి రూ.715, నైపుణ్యం లేని వారికి రూ.600 వేతనం నిర్ణయించారు. ఈ వేతనాలు 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకూ అమలులో ఉంటాయి. సమావేశంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, ఆర్అండ్‌బి ఎస్ఇ, ఇరిగే షన్ ఎస్ఇ, ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ, పంచాయతీ రాజ్ ఎస్ఇ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# బెయిల్‌పై స్టే ఇవ్వడమేంటి

దిల్లీ: బెయిల్ ఉత్తర్వులపై యాంత్రికంగా, ఎలాంటి కారణం లేకుండా స్టేలు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.అరుదైన కేసుల్లో మాత్రమే న్యాయస్థానాలు ఇందుకు మినహాయింపులివ్వాలని, యాంత్రికంగా స్టేలిచ్చి వ్యక్తి స్వేచ్ఛను నియంత్రించడం సరికాదని పేర్కొంది. స్టేలిచ్చుకుంటూ పోతే.. రాజ్యాంగంలోని అధికరణం 21కి విలువ ఎక్కడ ఉంటుందని ఓ మనీలాండరింగ్ కేసులో నిందితుడి బెయిల్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో నిందితుడు పర్విందర్ సింగ్ ఖురానాకు ట్రయల్ కోర్టు గతేడాది జూన్ 17న జారీ చేసిన బెయిల్‌పై దిల్లీ హైకోర్టు స్టే ఉత్తర్వులిచ్చింది. వీటిపై గత నెల 7న సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇచ్చి.. ఖురానా బెయిల్‌ను పునరుద్ధరించింది.. "నిందితుడు ఉగ్రవాది అయితే తప్ప స్టే ఇవ్వడానికి కారణం ఏముంది?" అని హైకోర్టు ఉత్తర్వుపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలిచ్చిన తర్వాత యాంత్రికంగా స్టే ఉత్తర్వులు ఇవ్వొచ్చా..? ఒక ఏడాది పాటు ఆపేయొచ్చా.. మనం ఏం సంకేతాలిస్తున్నాం" అని ఈ సందర్భంగా ప్రశ్నించింది.



**గ్రామ న్యాయాలయాల పరిస్థితేంటి**

గ్రామ న్యాయాలయాలతో పౌరులకు వేగంగా న్యాయం లభించడమే కాకుండా, కోర్టులపైనా పెండింగ్ కేసుల భారం తగ్గుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తక్షణమే గ్రామాల్లో న్యాయాలయాల పరిస్థితిపై సమగ్ర నివేదికతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను, హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లను ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ గ్రామ న్యాయాలయాలపై 2008లోనే పార్లమెంటు చట్టం తెచ్చిందని, దాని ప్రకారం ఇప్పటికే ఆరువేల గ్రామాల్లో కోర్టులు ఏర్పడాలని కానీ కేవలం 264 గ్రామాల్లోనే ఇవి పనిచేస్తున్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టు..ఆ ఐఏఎస్ అధికారి ట్రాన్స్‌ఫర్. డిప్యుటేషన్‌పై ఏపీకి ..ఆ ఆఫీసర్ బ్యాక్ గ్రౌండ్ ఇదే



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తరలివస్తున్న సంగతి తెలిసిందే.ఈ జాబితాలోకి కేరళ క్యాడర్‌కు చెందిన తెలుగు యువ ఐఏఎస్ అధికారి మైలవరపు కృష్ణతేజ చేరారు. ఐఏఎస్ అధికారి మైలవరపు కృష్ణతేజ డిప్యుటేషన్ పై రాష్ట్రానికి రానున్నారు. కేరళలోని త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా కృష్ణతేజ పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఐఏఎస్ అధికారి కృష్ణతేజను మూడేళ్లపాటు ఏపీకి డిప్యుటేషన్‌పై పంపించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహించే మంత్రిత్వ శాఖల్లో కృష్ణతేజ పనిచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**అవార్డులు కృష్ణతేజ సొంతం**

ఇకపోతే ఐఏఎస్ అధికారి కృష్ణతేజ స్వస్థలం పల్నాడు జిల్లా చిలకలూరిపేట. కేరళ క్యాడర్‌కు ఎంపికైన కృష్ణతేజ మంచి టాలెంటెడ్‌గా గుర్తింపు పొందారు. సమర్థుడైన ఐఏఎస్ అధికారిగా మంచి గుర్తింపు పొందారు. పలు అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు. కలెక్టర్‌గా కృష్ణతేజ కృషికి గుర్తింపుగా 2 అంతర్జాతీయ పురస్కారాలు, 7 జాతీయ అవార్డులు వరించిన సంగతి తెలిసిందే. బాలల హక్కుల రక్షణలో త్రిసూర్ జిల్లాను దేశంలోనే అగ్రగామిగా కృష్ణతేజ నిలిచారు. ఈ క్రమంలో జాతీయ బాలల రక్షణ కమిషన్ ఆయనను పురస్కారానికి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృష్ణతేజను అభినందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.

**పంచాయతీరాజ్ శాఖ అప్పగించే అవకాశం**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయినప్పటి నుంచి ఐఏఎస్ అధికారి కృష్ణతేజ ఏపీకి డిప్యుటేషన్‌పై వస్తారని ప్రచారం ఉంది. డిప్యూటీ సీఎం ఓఎస్డీగా ఉంటారనే టాక్ వినిపించింది. కానీ అలా జరగలేదు. ఓఎస్డీగా మరో అధికారి నియమితులైన సంగతి తెలిసిందే. ఇటీవలే కృష్ణతేజ అమరావతి వచ్చి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కృష్ణతేజ డిప్యుటేషన్ పై ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సైతం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ %ం% ట్రైనింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్ అధికారి కృష్ణతేజకు పంచాయతీ రాజ్ శాఖ బాధ్యతలను అప్పగించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతుంది.

**ఐఏఎస్ అధికారిగా ప్రత్యేక గుర్తింపు**

2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కృష్ణతేజ గతంలో కేరళ రాష్ట్రంలో పలు విభాగాల్లో పని చేశారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ, పర్యాటకశాఖ డైరెక్టర్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్, అలప్పుజ జిల్లా కలెక్టర్‌గా కృష్ణతేజ సేవలు అందించారు. ఇటీవలే త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా కృష్ణతేజ పనిచేశారు. ఇటీవలే జాతీయ బాలల రక్షణ కమిషన్ ఆయనను పురస్కారానికి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. బాలల హక్కుల రక్షణలో త్రిసూర్ జిల్లాను ఆయన దేశంలోనే అగ్రగామిగా నిలిపి అందరి ప్రశంసలు పొందారు. ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కృష్ణతేజ అద్భుతమైన పనితీరు కనబరుస్తూ పాలనలో తనదైన ముద్రవేసుకుంటూ వచ్చారు. ఇక ప్రస్తుతం సొంత రాష్ట్రమైన ఏపీలో కీలక బాధ్యతలు నిర్వహించేందుకు ఐఏఎస్ అధికారి కృష్ణతేజ సిద్ధం అయ్యారు.

# చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్.. ఎందుకో తెలుసా?

అమరావతి : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి కేంద్రం తమకు రూ.లక్ష కోట్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.అయితే దీనికి సంబంధించిన వార్తపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం బలమైన ప్రాంతీయ పార్టీలు మాత్రమే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగలవని అన్నారు. ఇతరులపై ఆధారపడకుండా ఉండే ప్రాంతీయ పార్టీలు మాత్రమే తెలంగాణకు రక్షణగా ఉంటాయన్నారు. తెలంగాణ ప్రజలు ఈ విషయాన్ని దగ్గరి నుంచి చూస్తున్నారని ఆశిస్తున్నానని.. తెలంగాణకు సొంత రాజకీయ గుర్తింపు ఉండటమే ఉత్తమమని పేర్కొన్నారు.మరోవైపు.. గురువారం బీఆర్ఎస్ విద్యార్థి నాయకులను ఉద్దేశించి మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. మహబూబ్‌నగర్ మీటింగ్‌లో విద్యార్థులను, నిరుద్యోగ యువతను అవమానించిన రేవంత్.. వాళ్లకి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రేవంత్ విపక్షంలో ఉన్నప్పుడు.. 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక 6 వేల అదనపు పోస్టులు మాత్రమే ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మొత్తం 1.62 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేటీఆర్ అన్నారు.అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్‌కు కూడా కేటీఆర్ లేఖ రాశారు.



చేనేత కార్మికుల ప్రయోజనం కోసం సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ తీసుకువచ్చేలా చూడాలని కోరారు. అలాగే త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయించేలా బండి సంజయ్ కృషి చేయాలన్నారు. ఇదిలాఉండగా.. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు వలస వెళ్తున్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై రాహుల్ గాంధీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై కేటీఆర్ మండిపడ్డారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచ్ న్యాయ్ దాక్యుమెంట్ ప్రకారం.. ఫిరాయింపుల వ్యతిరేక చట్టాలను పటిష్టం చేయాలంటూ డిమాండ్ చేశారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఎట్టకేలకు దిగొచ్చిన అండమాన్ ప్రభుత్వం



శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల ఆందోళనలు, నిరసనలతో అండమాన్ నికోబార్ ప్రభుత్వం దిగివచ్చింది. మృతురాలి భర్తకు ఉద్యోగం, లెఫ్టినెంట్ గవర్నర్ రిలీఫ్‌ఫండ్, ఎంపి ఫండ్స్ నుంచి సాయానికి హామీ ఇచ్చింది. ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై ఈనెల పదో తేదీన లాఠీఛార్జి చేయడంతో పాటు టియర్‌గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 50 మందికి పైగా మత్స్యకారులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే పోర్టుబ్లెయిర్‌లో తిరుపతిమందిర్ ప్రాంతంలో నివాసముంటున్న శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఇసకలపాలెంకు చెందిన మత్స్యకారుడు కె.కృష్ణారావు భార్య విమల (21) తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. ఈనెల ఆరో తేదీన కుటుంబసభ్యులు ఆమెను పోర్టుబ్లెయిర్‌లోని జిబిపంత్ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. నర్స్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఆమె మరణించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతిపై విచారణకు, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఏడో తేదీన ఆసుపత్రి వద్ద దీక్షలు ప్రారంభించారు. పదో తేదీన ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో వైద్యుల తప్పిదం లేదని ఇవ్వడంతో మత్స్యకారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ రోజు సాయంత్రం పోర్టుబ్లెయిర్‌లోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రహదారిని దిగ్బంధించారు. ఆందోళనా ప్రాంతానికి అధికారులు చేరుకున్నారు. ధర్నా విరమించాలని, న్యాయం చేస్తామంటూ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రాతపూర్వకంగా హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని ఆందోళనకారులు తేల్చిచెప్పారు. సరిగ్గా రాత్రి ఏడు గంటల ప్రాంతంలో విద్యుత్ దీపాలను ఆపేసి మత్స్యకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేశారు. ఈ దాడిలో 50 మందికిపైగా మత్స్యకారులు గాయపడ్డారు. మత్స్యకార మహిళ మృతి విషయం, పోలీసుల లాఠీఛార్జి అన్ని ప్రాంతాలకు విస్తరించడంతో తెలుగు మత్స్యకారులతో పాటు తమిళులు భారీ ర్యాలీ చేశారు. వీరికి సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు అక్కడి మత్స్యకార సంఘాలు సంఘీభావం తెలిపాయి. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తెలుగు వారికి కోసం ఆసుపత్రిలో తెలుగు అనువాదకులను నియమించాలని, పోర్టుబ్లెయిర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై అక్కడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేశవచంద్ర హామీ ఇవ్వడంతో మత్స్యకారులు శాంతించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించడంతో శుక్రవారం మృతురాలికి అంత్యక్రియలు చేశారు. ఆమెకు ఏడాదిన్నర వయసున్న బాబు ఉన్నారు.

**చొరవ చూపిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు**

పోర్టుబ్లెయిర్‌లో చోటుచేసుకున్న ఘటనపై ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, అక్కడి మత్స్యకారులు%ొ%. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అక్కడి అధికారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మృతురాలి భర్త కృష్ణరావుకు ఉద్యోగం, లెఫ్టినెంట్ గవర్నర్ రిలీఫ్‌ఫండ్, ఎంపి ఫండ్స్ నుంచి సాయం చేస్తామని వార్డు కమిటీ, అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపి బిష్ణు పదరే హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ కూటమికి భారీ విజయం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వీప్..



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో దారుణంగా విఫలమైన బీజేపీ నేతృత్వంలోని 'మహయుతి' కూటమి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. కూటమిలో భాగమైన బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్ పవార్) కలిసి రాష్ట్ర శాసన మండలి ఎన్నికల్లో సత్తా చాటాయి. 11 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ కూటమి మొత్తం 09 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస ఒక స్థానంలో విజయం సాధించింది. రాష్ట్ర శాసనసభ ఎగువ సభలోని 11 స్థానాలకు మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అసెంబ్లీలోని ఎమ్మెల్యేల సంఖ్య 288, అయితే 274 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. వీరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేశారు. ఒక అభ్యర్థి గెలవడానికి 23 ప్రాధాన్యత ఓట్లు అవసరం. శాసన మండలి ఎన్నికల్లో ముగ్గురు బిజెపి నాయకులు పంకజా ముండే, పరిణయ్ ఫుకే , యోగేష్ తిలేకర్‌లు ఒక్కొక్కరు 26 ఓట్లు సాధించి విజయం సాధించారు. అజిత్ పవార్ పార్టీకి చెందిన రాజేష్ విటేకర్ మరియు శివాజీరావు గార్జే గెలుపొందారు. షిండే సేనకు చెందిన భావనా గాల్లీ కూడా గెలిచారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మహాయుతికి 201 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. తొమ్మిది మంది ఇండిపెండెంట్లు కూడా మహాయుతికి సపోర్ట్ చేశారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీకి కేవలం 67 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘోరంగా దెబ్బతింది. 48 ఎంపీ సీట్లున్న ఆ రాష్ట్రంలో ఎన్డీయే కేవలం 17 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)ల మహావికాస్ అఘాడీ ఏకంగా 30 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఫలితాలు ఎన్డీయేని నిరాశ పరిచాయి. అయితే, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది.

# పీఎం కిసాన్ 18వ విడత నిధులు? ఈ రెండు పనులు చేయకుంటే డబ్బులు రావు!



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. అలానే మహిళలు, రైతులు, యువత అభివృద్ధి కోసం కూడా ఎన్నో స్కీమ్స్ ను ప్రారంభించింది. ముఖ్యంగా వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసేందుకు, రైతుల ఆదాయం పెంచేందుకు అనేక సదుపాయాలను కేంద్రం కల్పిస్తుంది. అలానే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ.%ొ% ఆర్థికంగా ఆదుకుటుంది. ఈ క్రమంలోనే తరచూ రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెబుతుంది. ముఖ్యంగా పీఎం కిసాన్ కి సంబంధించి ఏదో ఒక న్యూస్ వస్తోంది. అలానే తాజాగా 18వ విడత పీఎం కిసాన్ కి సంబంధించి కీలక అప్ డేట్ వచ్చింది. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టింది. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కర్షకుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. రైతులకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాలను అందించే పథకామే పీఎం కిసాన్ యోజన. 2018 సంవత్సరంలో రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనను ప్రారంభించింది. ఈ పథకం కింద లబ్ధిదారులకు ఏటా రూ.6 వేలు అందజేస్తారు. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రూ.2వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు 17 విడతల్లో భారత ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. జూన్ నెలలో ప్రధాని నరేంద్ర మోదీ వారణాసి నుంచి 17వ విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారు. ఇక ఈ స్కీమ్ కింద తదుపరిగా 18వ విడత రావాల్సి ఉంది. 18వ విడతను పీఎం కిసాన్ యోజన్ అక్టోబర్ నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేయవచ్చు. అయితే ఈ నిధులు విడుదల సమయం దగ్గర పడే లోపు.. రైతులు కొన్ని ముఖ్యమైన పనులు చేయాల్సి ఉంటుంది. లేదంటే వారి పీఎం కిసాన్ నిధులు పడకుండా పోయే అవకాశం ఉంది. ఈ నిధులు పొందే రైతులకు సంబంధించి ఇప్పటికే కీలక విషయాలను కేంద్ర ప్రభుత్వం చెప్పిన సంగతి తెలిసింది. పథకం కోసం పొందాలనుకునే వారు, లబ్ధిదారులైన రైతులు ఇ-కెవైసి, భూమికి సంబంధించిన ధృవీకరణను పొందడం చాలా అవసరం. ఇప్పటి వరకు ఈ కార్యక్రమాలు చేయని రైతులు వెంటనే చేసుకోవడం ఉత్తమం. లేకుంటే 18వ విడత నిధులు నిల్చిపోయే అవకాశం ఉంది. మరి..ఈ స్కీమ్ పై మీ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేయండి.

# పుట్టగొడుగుల కూర లొట్టలేసుకుని తిన్నారు.. ఆ తరువాతే మొదలైంది అసలు కథ..!



అమరావతి : ఎంతో ఇష్టంతో అడవిలో దొరికిన పుట్టగొడుగులను తీసుకొచ్చాడు ఇంటిపెద్ద. కాఫీ తోటల్లో పనులు ముగించుకుని వస్తుండగా, పుట్టగొడుగులు కనిపించాయి. వాటిని సేకరించి ఇంటికి తీసుకువచ్చాడు. ఇంటికి తీసుకువచ్చి కూర వండుకొని కుటుంబమంతా కలిసి తిన్నారు. ఒక్కొక్కరుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. అల్లూరి జిల్లా ఏజెన్సిలో పుట్టగొడుగులు కూర ఓ కుటుంబాన్ని ఆసుపత్రి పాలు చేసింది. జీకే వీధీ మండలం సిరిబాల గ్రామానికి చెందిన అచ్యుత్, కాఫీ తోటలో కూలీ పనికి వెళ్ళాడు. సాయంత్రం పని ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరాడు. దారిలో పుట్టగొడుగులు కనిపించాయి. పుట్టగొడుగులను ఆనందంతో సేకరించి ఇంటికి తీసుకొచ్చాడు. వాటిని కూర వండుకుని కుటుంబ సభ్యులంతా కలిసి భోంచేశారు. తిన్న పది నిమిషాల వ్యవధిలోనే వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన వారిలో అచ్యుత్, సుమిత్ర, శేషాద్రి, పెద్ద లక్ష్మి, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. వారందరిని హుటాహుటిన ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అక్కడ నుంచి చింతపల్లి CHC కు తరలించారు. చింతపల్లి ఆసుపత్రిలో ఆరోగ్యం కుదట పడకపోవడంతో పాడేరు

# చంద్రబాబు అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించడం శుభపరిణామం



అమరావతి: అమరావతి నగరంలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టటం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. దేవాలయాల్లో కూడా రాజకీయాలు చొరబడి, ఆలయాలు నిర్మించకుండా చేసిన ప్రభుత్వాలను మనం చూశామన్నారు. దేవుడు ఉన్నాడు కాబట్టే ఎన్నో అవరాధాలు అధిగమించి గోకుల క్షేత్రం నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడటం ఎంతో ముఖ్యమన్నారు. ఇందులో ఇస్కాన్ సంస్థ ముందుండటంతో పాటు ఎంతోమందికి అన్నదానం కూడా చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్నా క్యాంటీన్లను సీఎం చంద్రబాబు ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించుడటం శుభపరిణామమని ఎన్వీ రమణ పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ ఎంతో తోడ్పాటునిచ్చిందన్నారు. ఎవరూ అర్ధాకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ఎంతోమందికి అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేస్తోందన్నారు. అమరావతి నగరంలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టటం శుభసంకేతమన్నారు. దేవాలయాల్లో కూడా రాజకీయాలు చొరబడి, ఆలయాలు నిర్మించకుండా చేసిన ప్రభుత్వాలను మనం చూశామని పేర్కొన్నారు. దేవుడు ఉన్నాడు కాబట్టే ఎన్నో అవరాధాలు అధిగమించి గోకుల క్షేత్రం నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందని ఎన్వీ రమణ అన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడటం ఎంతో ముఖ్యమని ఎన్వీ రమణ పేర్కొన్నారు. ఇందులో ఇస్కాన్ సంస్థ ముందుండటంతో పాటు ఎంతోమందికి అన్నదానం కూడా చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్న క్యాంటీన్లను చంద్రబాబు ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించుడటం శుభపరిణామమని పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ ఎంతో తోడ్పాటునిచ్చిందన్నారు. ఎవరూ అర్ధాకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ఎంతోమందికి అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేస్తోందని ఎన్వీ రమణ పేర్కొన్నారు.

# 'నాకోసం అవి తీసుకురండి'.. విజిటర్లకు పవన్ విజ్ఞప్తి



అమరావతి : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాన్ తనదైన మార్క్ చూపుతున్నారు. అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ వారికి ఆదేశాలు జారీ చేస్తూ వ్యవస్థలను గాడిన పెట్టడంపై ఫోకస్డ్‌గా ముందుకు సాగుతున్నారు పవన్ కల్యాణ్. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ప్రజలతో మమేకమవుతూ వారి కష్టాలను, సమస్యలను తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి కృషి చేస్తూ ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం తనకు అప్పగించి శాఖలపై కూడా ఆయన స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఒకవైపు తన శాఖలపై పట్టు సాధించడానికి శ్రమిస్తూనే మరోవైపు ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనను కలవడానికి వచ్చే వారిని ఓ విజ్ఞప్తి చేశారు పవన్ కల్యాన్. తన దగ్గరకు వచ్చే ఏం తీసుకురావాలి అన్న అంశాన్ని పవన్ కల్యాణ్ వివరించారు.

**శాలువా, బొకే వద్దు :** "నన్ను కలవడానికి వచ్చే వారు ఎవరైనా బొకేలు, శాలువాలు, విగ్రహాలు వంటివి తీసుకురాకండి. కచ్చితంగా ఏమైనా తీసుకురావాల్సిందే అనిపిస్తే వాటి స్థానంలో ప్రజలకు ఉపయోగపడేవీ మరేవైనా తీసుకురండి. బొకేలు, శాలువాల బదులుగా వాటికి అయ్యే ఖర్చుతోనే కూరగాయలో, పండ్లో తీసుకురండి.. వాటిని అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకో అందించొచ్చు. అవి తీసుకురావడం కుదరదు అనిపిస్తే.. వాటి కొనుగోలు ఖర్చు చేసే నగదును టోకెన్ రూపంగా అందిస్తే.. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలను రూ. 5కే భోజనం అందించడానికి వాటిని వినియోగిస్తాం. నన్ను కలవడానికి వచ్చే వారిని నేను కోరేది ఇదే" అని చెప్పారాయన.

**కూరగాయలతో వచ్చిన ఎంపీలు :** పవన్ కల్యాణ్ చేసిన విజ్ఞప్తి మేరకు ఆయనను కలవడానికి వచ్చిన జనసేన ఎంపీలు బొకేలు, శాలువాల బదులుగా కూరగాయలు తీసుకుని వచ్చారు. ఈ వినూత్న ఆలోచనను మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం తన దగ్గరకు కూరగాయల బుట్టలతో వచ్చిన ఎంపీలు బాలశౌరి, ఉదయ్‌లను పవన్ కల్యాణ్ అభినందించారు. మనం చేసే ప్రతి పని పది మందికి పనికొచ్చేలా ఉండాలని, ఆ దిశగానే ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోందని వారు చెప్పుకొచ్చారు. అయితే పవన్ కల్యాణ్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం సంచలనంగా మారింది. ప్రజానాయకుడు అంటే ఇలా ఉండాలంటూ కొందరు ప్రశంసిస్తున్నారు.

# వయసు 80 పీజీలు 20.. చదువుల్లో రాణిస్తున్న వీరాస్వామి!



హైదరాబాద్ : ఆయన వయసు 80 ఏళ్లు.. పేరు పక్కన డిగ్రీలను రాయాల్సి వస్తే అది పొడుగాటి లైనే అవుతుంది. ఎందుకంటే ఆయన ఇప్పటికి 20 పీజీలు పూర్తిచేశారు. నిత్య విద్యార్థిగా ఇంకా చదువుతూనే ఉన్నారు. ఆయనే వరంగల్‌కు చెందిన డాక్టర్ అంకతి వీరస్వామి. ఆయన ఇంతవరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 3, కాకతీయ నుంచి 7, ఇందిరాగాంధీ వర్సిటీ నుంచి 4, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 3, పలు రాష్ట్రాలకు చెందిన ఇతర యూనివర్సిటీల నుంచి మరో 3 పీజీలు చేశారు. ఇక్కడితో ఆయన చదువు ఆపలేదు. తాజాగా ఇగ్నో నుంచి ఎంఏ ఆంత్రోపాలజీ పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచిచూస్తున్నారు. ఆయన 1962లో హెచ్ఎస్సీ ఉత్తీర్ణులయ్యారు. తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి 1968లో వరంగల్‌లోని ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. 1973లో దూరవిద్య ద్వారా బీఏ చేశారు. 1978లో బీఈడీ పూర్తిచేశారు. చదువంటే ఎంతో ఇష్టపడే వీరస్వామి 1981లో హిమాచల్‌ప్రదేశ్‌లో ఎంఈడీ చేస్తున్న సమయంలో ఒక ప్రొఫెసర్ మూడు పీజీలు పూర్తి చేయడం చూసి స్ఫూర్తి పొందారు. దూరవిద్య ద్వారా వివిధ విశ్వవిద్యాలయాల్లో వరుసగా పీజీలు చేస్తూనే ఉన్నారు. ఉస్మానియా వర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంతోపాటు మరో రెండు, మద్రాసు యూనివర్సిటీ నుంచి సైకాలజీ, పొట్టి శ్రీరాములు వర్సిటీ నుంచి ఎంసీజే, ఎంఏ జ్యోతిషం ఇలా అనేక పీజీలు చేశారు. మొత్తం పాతిక పీజీలు చేయాలన్నదే తన సంకల్పమని వీరస్వామి వెల్లడించారు. 2002లో ఉద్యోగ విరమణ పొందాక వరంగల్ స్తంభంపల్లిలో తన పేరిటే ఏవీఎస్ పాఠశాల నెలకొల్పారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన పిల్లలు, శిష్యులను కూడా పీజీలు చేసేలా స్ఫూర్తి నింపారు. ఈ వయసులోనూ నిత్యం యోగా చేస్తూ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తారు. ఎయిడ్స్‌పై అవగాహన, యోగాతోపాటు అనేక అంశాలపై ఇప్పటికీ రేడియో, టీవీల్లో బుర్రకథలు చెబుతారు. న్యూయార్క్‌కు చెందిన ఒక వర్సిటీ వీరస్వామికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రోజూ రాత్రి 7.30 నుంచి పదిన్నర వరకు పుస్తకాలు చదువుతూ ఉంటేనే తన బుర్ర చురుగ్గా ఉంటుందని ఆయన చెబుతున్నారు.

# బంధువులు అంతా దొంగలుగా మారారు




నల్గొండ: నల్లగొండ జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాఠశాలలో బ్యాటరీ దొంగతనం చేసిన ముఠాని పట్టుకుని సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇదే విషయమై డిఎస్పీ శివరాం రెడ్డి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఫిర్యాదు మేరకు నల్లగొండ జిల్లాలో ప్రభుత్వం పేద విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ క్లాసెస్ విద్యను అందించాలని, మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ పరికరాలతో అలాగే వాటి నిర్వహణ కొరకు విలువైన బ్యాటరీలు అందించడం జరిగింది అన్నారు. అవి చోరీకి గురి అవుతున్నాయని ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా ఎస్పీ శరత్ చంద్ర ప్రత్యేక దృష్టి పెట్టి దుండగులను పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12 వ తేదీన తెల్లవారుజామున పక్కా సమాచారం మేరకు నల్గొండ సీసీఎస్, శాలిగౌరరం పోలీసులు శాలిగౌరరం నుంచి నకిరేకల్ మీదుగా హైదరాబాద్ కి వెళ్తున్న ట్రాలీ ఆటో TS 01 UA2466 గల నెంబర్ ఆటో ని ఆపి తనిఖీ చేయగా బ్యాటరీ లోడ్ తో పట్టుబడ్డారు. అక్కడ ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా వీరందరూ కూడా బంధువులు అని 4 గురు వ్యక్తులు పట్టుబడినారు. వీరందరూ నకిరేకల్ పట్టణానికి చెందిన వ్యక్తులు అని తెలిపారు. వీరి వద్ద నుంచి 17 నేరాలకు సంబంధించిన 7.18 లక్షల విలువైన 100 బ్యాటరీలు, ఒక ట్రాలీ ఆటో, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు రెండు ముఠాలు గా ఏర్పడి కొందరు నల్లగొండ జిల్లాలో కొందరు సూర్యపేట జిల్లాలో అలాగే మహబూబ్ బాద్ జిల్లాలో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చారు. నల్లగొండ జిల్లాలో కట్టంగూరు, శాలిగౌరరం, కేతేపల్లి, నకిరేకల్, తిప్పర్తి, మాడ్గులపల్లి, సూర్యాపేట జిల్లాలోని చివ్వేంల, ఆత్మకూరు ఎస్, అర్వపల్లి పరిధిలో పలు గ్రామాలలో ఉన్న 17 ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాటరీలు చోరీ చేసినట్లు తెలిపారు. రాత్రి కి రాత్రి దొంగతనాలు చేసారని వీరిని పట్టుకోవడం లో సీసీఎస్ టీం, సీసీఎస్ ఇన్స్పెక్టర్ జితేందర్ రెడ్డి, ఆధ్వర్యంలో సీఐ రాజశేఖర్, సిఐ కొండల్ రెడ్డి, ఎస్సై సైదులు, సిబ్బంది విష్ణు, వర్ధనగిరి, లింగారెడ్డి, శ్రీధర్ రెడ్డిని అభినందించారు.

# New High-Speed Corridor: Mumbai Coastal Road from Haji Ali to Worli Now Open; Check Timings

